

అతివ.. నీవెక్కడ?

చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగం కల్పించిన హక్కు జల్‌పల్లిలో అమలు కావడం లేదు. 10లో▸



ప్రజాపాలనపై దృష్టి పెట్టాలి

అధికార పార్టీ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని సర్పంచులు సూచించారు. 10లో▸



మున్సిపాలిటీలపై..

మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. 10లో▸

న్యూస్‌రీల్

మున్సిపాలిటీ ప్రణాళికను సిద్ధం చేసుకోండి

అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్



బడ్జెట్ సమావేశాలపై అధికారులతో చర్చిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

ఇబ్రహీంపట్నం రూరల్: మున్సిపాలిటీల్లో అభివృద్ధి కోసం 2024–25 సంవత్సరానికి గాను ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. రాబోయే సంవత్సరానికి గాను అభివృద్ధి నిధులు, ఖర్చుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎండీఏ నుంచి రావాల్సిన నిధులపై ఆరా తీశారు. పన్నుల రూపకంగా వచ్చే నిధులు, ఖర్చు వివరాలను కమిషనర్, అకౌంట్స్ అధికారులను అడిగి వృథా ఖర్చులు తగ్గించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రెండు రోజుల్లో పాలకవర్గంతో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్‌రెడ్డి, టీపీఓ అబీబ్‌ఉన్నీసాబేగం, ఏఈ వీరాంజనేయులు, మేనేజర్ శ్రీనివాస్, అకౌంట్స్ అధికారి స్వాతి పాల్గొన్నారు.

ఫిబ్రవరి 8న అవిశ్వాస సమావేశం?

ఆదిబట్ల మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌ను తొలగించాలని పాలకవర్గం సభ్యులు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కొత్త చైర్మన్ ఎన్నిక కోసం ఫిబ్రవరి 8వ తేదీని ప్రకటించినట్లు తెలిసింది. నేడు లేదా రేపు పాలకవర్గం సభ్యులకు నోటీసులు అందజేయనున్నట్లు సమాచారం.

కాంగ్రెస్ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా జ్యోతి



నియామకపత్రం అందుకుంటున్న పామెన జ్యోతి

చేవెళ్ల/షాబాద్: జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా పామెన జ్యోతి భీంభరత్‌ను నియమించినట్లు అధ్యక్షురాలు జయమ్మ తెలిపారు. నగరంలోని గాంధీభవన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో షాబాద్ మండలం నరెడ్లగూడ గ్రామానికి చెందిన పామెన జ్యోతి భీంభరత్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మహిళలకు వరం లాంటిందని, మహిళల సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. దశలవారీగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తుందని పేర్కొన్నారు.



చంద్రాయన్ గూడ, అప్పారెడ్డిగూడ గ్రామాల మధ్య వాగులో నిర్మిస్తున్న ప్రహరీ

వాగునూ వదల్లేదు!

దర్జాగా ఆక్రమణ

- యథేచ్ఛగా ప్రహరీ నిర్మాణం
- చెరువుల ఉనికికి ప్రమాదం
- పట్టని అధికార యంత్రాంగం

నందిగామ:అది షాద్‌నగర్ నియోజకవర్గంలోనే అతి పెద్ద చెరువు.. ఆ చెరువు నిండితే చుట్టూ ఉన్న సుమారు 15 గ్రామాల్లో నీటికి ఢోకా ఉండదు. అలాంటి చెరువులోకి వచ్చే వాగుని ఆక్రమించుకొని అక్రమంగా ప్రహరీ నిర్మిస్తుండడం కబ్జారాయుళ్ల ఆగడాలకు అద్దం పడుతోంది. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం పట్టనట్టు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

వివరాల్లోకి వెళ్తే..

మండల పరిధిలోని నర్సప్పగూడ, తీగాపూర్ శివారులోని అక్కమ్మ చెరువు శిఖం సుమారు 160 ఎకరాలు ఉండగా ఆయకట్టు 350 ఎకరాల వరకు ఉంటుంది. అప్పారెడ్డిగూడ ప్రాంతం మీదుగా వెళ్లే వాగు పారితేనే ఈ చెరువు నిండుతుంది. ఈ వాగు అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి శివారుల మీదుగా అక్కమ్మ చెరువులోకి వస్తుంది. నందిగామ పంచాయతీ పరిధిలోని చంద్రాయన్‌గూడ నుంచి అప్పారెడ్డిగూడకు వెళ్లే దారిలో వాగుకు సమీపంలో ఇటీవల భూములు కొనుగోలు చేసిన కొంతమంది కన్ను ఆ వాగుపై పడింది. నందిగామ శివారులోని సర్వే నంబరు 1452లో భూములు కొనుగోలు చేసిన సదరు వ్యక్తులు వాగును ఆక్రమించుకొని ఏకంగా ప్రహరీ నిర్మిస్తున్నారు.దీంతో వాగు ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా అతి పెద్ద వాగు నీటి ప్రవాహాన్ని అడ్డుకోవడం ద్వారా వాగుకు మరోవైపు భూముల్లో నుంచి కోత పడి పంట పొలాలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు ఇవీ..

వాగు 10 మీటర్ల వెడల్పు ఉన్నట్లయితే రెండు వైపులా 9 మీటర్ల వరకు బఫర్ కోసం వదిలేయాలి. పది మీటర్ల లోపు వెడల్పు గల వాగు అయితే రెండు వైపులా 2 మీటర్ల మేర బఫర్‌కు వదిలేసి ప్రహరీనిర్మించుకోవాలి. ప్రభుత్వ భూమి అయినా, పట్టా భూమి అయినా ఇవే నిబంధనలు వర్తిస్తాయి. కానీ ఇక్కడ నిబంధనలు తుంగలో తొక్కిన సదరు వ్యక్తు లు ఇష్టానుసారంగా వాగులోనే నిర్మాణాలు చేపడుతున్నారు.దీంతో అక్కమ్మ చెరువు నిండేందుకు ఆధారమైన ఈ పెద్ద వాగు ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.



ప్రస్తుతం ప్రహరీ నిర్మిస్తున్న ప్రదేశంలో ప్రవహిస్తున్న వాగు (ఫైల్)

అధికారులు ఏం చేస్తున్నట్లు..?

మండల కేంద్రమైన నందిగామకు అతి సమీపంలో రోడ్డు పక్కనే జరుగుతున్న ఈ తతంగం నిత్యం అదే దారిలో వచ్చివెళ్లే అధికారులకు తెలియకుండా ఉంటుందా.. తెలిసీ తమకెందుకులే అని వదిలేస్తున్నారా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అక్కమ్మ చెరువులోకి వచ్చే వాగును ఆక్రమించుకొని చేపడుతున్న నిర్మాణాలను అడ్డుకోవాలని, చెరువులోకి నీరు యథావిధిగా వచ్చేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

అక్కమ్మ చెరువులోకి వచ్చే వాగును ఆక్రమించుకొని ప్రహరీ నిర్మిస్తున్నారనే విషయం మా దృష్టికి రాలేదు. కొన్ని రోజులుగా సెలవులో ఉన్నాను. వీలైనంత త్వరలో వాగును పరిశీలిస్తాం. ఒకవేళ అక్రమంగా నిర్మాణాలు చేపట్టినట్లయితే చర్యలు తీసుకుంటాం.

– కార్తీక్, ఇరిగేషన్ ఏఈ, నందిగామ

విచారణ చేయిస్తా



పాటు కాల్వలను, వాగులను ఎట్టి పరిస్థితుల్లో కబ్జా చేయకూడదు. చంద్రాయన్‌గూడ, అప్పారెడ్డిగూడ మధ్యన వాగుకు ఆనుకొని ప్రహరీ నిర్మిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఆర్ఐ, సర్వేయర్‌ను పంపించి విచారణ చేయిస్తా.

– అయ్యప్ప, తహసీల్దార్, నందిగామ

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలాలక్ష్మారెడ్డి

కడ్తాల్: పర్యావరణ పరిరక్షణకు ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్ పర్సన్ లీలాలక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎర్త్‌సెంటర్‌లో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్, తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులకు నిర్వహించనున్న శిక్షణ శిబిరం మంగళవారం ప్రారంభమైంది. శిక్షణ శిబిరానికి నాగర్‌కర్నూల్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన 65 మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లీలాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, నాయకత్వం పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. శిక్షణ శిబిరంలో నేర్చుకున్న పర్యావరణ పరిరక్షణ అంశాలను పాఠశాలల్లో ముందుకు తీసుకుళ్లాలని కోరారు. అనంతరం పలువురు పర్యావరణవేత్తలు, శాస్త్రవేత్తలు పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్రపై వివరించారు. కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్‌టీ విశ్రాంత అధికారి వెంకట్‌రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్తలు ఉమామహేశ్వర్‌రెడ్డి, సురేశ్‌గుప్తా, నేల పర్మకల్చర్ నిపుణురాలు, పర్యావరణ ప్రచారకర్త స్నేహ, బాల చైతన్య కేంద్రాల నిర్వాహకుడు రజనీకాంత్, సీజీఆర్ సిబ్బంది వెంకటేశ్, బీరేశ్, లక్ష్మీప్రసన్న, నగేశ్, సుష్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీలాలక్ష్మారెడ్డి

హైదరాబాద్ అభివృద్ధిపై నేడు సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ జిల్లాలోని అభివృద్ధి పనులపై దృష్టి సారించింది. ఇప్పటికే జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియామకమైన పొన్నం ప్రభాకర్ తొలిసారిగా బుధవారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జిల్లాలో విద్య, వైద్యం, అభివృద్ధి పనులు చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో సుమారు 15కుపైగా అభివృద్ధి పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉండగా, మరి కొన్ని పనులు పురోగతి దిశలో ఉన్నాయి. వాటిని సమీక్షించి పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాల ముహూర్తాలు ఖరారు చేసే అవకాశం ఉంది. పెండింగ్ పనులపై దిశా నిర్దేశం చేయనున్నారు. ఇటీవల ప్రజాపాలనలో స్వీకరించిన ఐదు గ్యారంటీ పథకాల దరఖాస్తులపై చర్చించనున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలపై కూడా సమీక్షించనున్నారు. తొలిసారిగా మంత్రి సమీక్ష సమావేశానికి హాజరు కానుండటంతో పూర్తి స్థాయి సమాచారంతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈజీఎస్ పనుల్లో అవినీతిని సహించేది లేదు

- డీఆర్డీఏ పీడీ ప్రభాకర్

మాడ్గుల: ఈజీఎస్ పనులు చేపట్టడంలో అక్రమాలకు చోటివ్వొద్దని డీఆర్డీఏ పీడీ ప్రభాకర్ పేర్కొన్నారు. అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సామాజిక తనిఖీలో భాగంగా మండల పరిధిలోని అప్పారెడ్డిపల్లిలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ ప్రభాకర్ మాట్లాడుతూ.. గ్రామసభలో సూచించిన విధంగా పనులు చేపట్టాలని, చేసే పనుల్లో నాణ్యత ఉండాలన్నారు. కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాల ని ఆయన కోరారు. గ్రామాల్లో జాబ్ కార్డు కావాలనుకునే కూలీలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ పల్లేటి పద్మ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎంపీపీ పద్మారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి విజిలెన్స్ అధికారి ఉష, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ కొండయ్య, ఏపీడీ సక్రియ నాయక్, ఎంపీడీవో రాఘువులు పాల్గొన్నారు.



అప్పారెడ్డిపల్లిలో నిర్వహించిన గ్రామసభ



ఉప్పల్ స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న భారత జట్టు

సమరానికి సై



రోహిత్



భాగ్యనగరం వాకిట్లో క్రికెట్ పండుగ వచ్చేసింది. అభిమానులందరికీ ప్రపంచ క్రికెట్‌లోని అగ్రశ్రేణి ఆటగాళ్లు తమ ఆటతీరుతో కనువిందు చేయడానికి 'సై' అంటున్నారు. గురువారం నుంచి ఉప్పల్ స్టేడియం వేదికగా భారత్, ఇంగ్లండ్ జట్లు టెస్టు సమరానికి సిద్ధమయ్యాయి. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు ఈనెల 25 నుంచి 29 వరకు హైదరాబాద్‌లో జరగనుండగా..రెండో టెస్టుకు ఫిబ్రవరి 2 నుంచి 6 వరకు విశాఖపట్నం ఆతిథ్యమివ్వనుంది. ఉప్పల్ స్టేడియంలో భారత జట్టు ఇప్పటి వరకు ఆరు టెస్టులు ఆడింది. ఇందులో నాలుగు టెస్టుల్లో గెలుపొంది, ఒక టెస్టును డ్రా చేసుకుంది. ఈ మైదానంలో భారత జట్టు తమ అజేయ రికార్డును కొనసాగించాలని మరో విజయాన్ని తమ ఖాతాలో జమ చేసుకోవాలని ఆశిద్దాం.

– సాక్షి, హైదరాబాద్



రాహుల్ ద్రావిడ్, మెకల్లమ్ మాటామంతి



స్టేడియాన్ని శుభ్రం చేస్తున్న కార్మికులు

పోవాలి వివక్ష.. కావాలి రక్ష

- గుట్టు చప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలు
- పుట్టక ముందే చంపేస్తున్న వైనం
- ఇకనైనా మార్పు వచ్చేనా?
- నేడు జాతీయ బాలికా దినోత్సవం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తరాలు మారినా.. టెక్నాలజీ పెరిగినా.. చట్టాలు కఠినతరమవుతున్నా.. ఇప్పటికీ ఆడపిల్లలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. పలు స్కానింగ్ సెంటర్లు కాసులకు కక్కుర్తి పడి కడుపులో పెరుగుతుంది ఆడో, మగో ముందే నిర్ధారిస్తున్నాయి. పుట్టబోయేది ఆడబిడ్డని తెలిసి కన్ను తెరవక ముందే కాటికి పంపేస్తున్నారు. ఫలితంగా బాలురతో పోలిస్తే బాలికల నిష్పత్తిలో భారీ వ్యత్యాసం నమోదవుతోంది. ఏడాదిగా జిల్లాలోని 51 ఆరోగ్య కేంద్రాల పరిధిలో 29,771 మంది పిల్లలు జన్మించగా, వీరిలో 15,562 మంది మగ పిల్లలు ఉండగా మరో 14,209 మంది ఆడ పిల్లలు ఉన్నారు. స్కానింగ్ సెంటర్లపై తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో కేంద్రాల నిర్వహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

12 మందికి జైలు శిక్ష విధించినా..

జిల్లాలోని 650 స్కానింగ్ సెంటర్లలో ప్రస్తుతం 472 పని చేస్తున్నాయి. మిగిలిన వాటిలో కొన్ని మూతపడగా.. మరికొన్ని సరిహద్దు జిల్లాలకు తరలిపోయాయి. ప్రతి డయాగ్నోస్టిక్‌లోనూ అర్హత కలిగిన రేడియాలజిస్ట్ ఉండాలి. కానీ చాలా కేంద్రాల్లో లింగనిర్ధారణ చట్టంపై కనీసం అవగాహన లేని కాంపౌండర్లు, నర్సులతో పరీక్షలు చేయిస్తున్నారు. వీరు కాసులకు కక్కుర్తిపడి పుట్టబోయేది ఆడో, మగో చెబుతూ పరోక్షంగా అబార్షన్లకు కారణమవుతున్నారు. ఆమనగల్లు, షాద్‌నగర్, చేవెళ్ల, శంషాబాద్, తుర్కయంజాల్, యాచారం, ఇబ్రహీంపట్నం, బీఎన్‌రెడ్డిలోని పలు స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు యథేచ్ఛగా జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఆరు కేంద్రాలపై కేసులు నమోదు చేసి, 12 మందికి జైలు శిక్ష విధించినా పరీక్షలకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. కొంత మంది ఆరోగ్య కారణాలను సాకుగా చూపిస్తుంటే.. మరికొంత మంది జిల్లా సరిహద్దులోని బీదర్, కర్నూలు జిల్లాలకు వెళ్లి అబార్షన్లు చేయించుకుంటున్నట్లు తెలిసింది.



పీఎన్‌డీటీపీసీ ఏం చెబుతోందంటే..

కడుపులో పెరుగుతున్న బిడ్డకు ఏమైనా జన్యుపరమైన లోపాలు ఉన్నాయా? శిశువు పెరుగుదల ఎలా ఉంది? అనే అంశాలను తెలుసుకునేందుకు మాత్రమే అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించాలి. కడుపులోని బిడ్డ ఆడో, మగో ఎట్టిపరిస్థితుల్లోనూ చెప్పకూడదు. లింగ నిర్ధారణకు సహకరించిన వారికి 3 నెలలు జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తారు. రెండోసారి కూడా ఇదే తప్పు చేసిన వారికి 5 సంవత్సరాల జైలు, రూ.50 వేల జరిమానా విధించే అవకాశం ఉంది. ఇలాంటి పనికి పూనుకుంది వైద్యులైతే.. వారి వృత్తి లైసెన్స్ కూడా రద్దవుతుంది. గర్భంలోని శిశువును ఆడ, మగ పోల్చమని కోరిన వారికి 3 సంవత్సరాల జైలు, రూ.50 వేల జరిమానా విధించవచ్చు.

2011 జనాభా లెక్కల ప్రకారం ఆరేళ్లలోపు చిన్నారుల్లో నిష్పత్తి	జిల్లా	పిల్లలు	బాలురు	బాలికలు	నిష్పత్తి
	హైదరాబాద్	4,19,500	2,16,428	2,03,072	938
	రంగారెడ్డి అర్బన్	4,09,723	2,10,274	1,99,449	947

నిఘా పెంచుతాం



నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లపై నిఘా పెంచుతాం. అనుమానం ఉన్న సెంటర్లపై స్ట్రింగ్ ఆపరేషన్ నిర్వహించి, వారిపై కేసులు నమోదు చేస్తాం. స్కానింగ్ సెంటర్లు విధిగా సంబంధిత ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. లేదంటే చర్యలు తప్పవు.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలి



ఆడ, మగ అనే తేడా పిలిచే పిలుపులో ఉండాలి తప్ప చూపించే ప్రేమలో ఉండకూడదు. ఈ జాఢ్యాన్ని రూపుమాపాలంటే ముందు కుటుంబ వ్యవస్థలో మార్పు రావాలి. అమ్మాయిలను గర్భస్థ శిశువు నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బాల్య వివాహాలను అరికట్టాలి.

– ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్

మౌలిక వసతులు కల్పించండి

శంషాబాద్: పట్టణంలోని రింగ్‌టౌన్ వైకుంఠదామంలో మౌలిక వసతులు కల్పించాలని సంఘసేవకులు, మాజీ సైనికుడు జనార్దన్ విన్నవించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మకు వినతి పత్రం అందజేశారు. వైకుంఠదామంలో సరైన సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రజాపాలనపై దృష్టి పెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు

వివిధ గ్రామాల బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు

- అధికార పార్టీపై విమర్శలు

కేశంపేట: అధికార పార్టీ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హమీల అమలు పైన దృష్టి పెట్టి సంక్షేమం కోసం పాటుపడాలని మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు సూచించారు. మండల కేంద్రంలో వారు మంగళవారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామ సర్పంచ్ నవీన్‌కుమార్, ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్‌లను అరెస్టు చేసి కొందుర్గు పోలీస్‌స్టేషన్‌కు తరలించడం అన్యాయమన్నారు. అధికారుల సూచనల మేరకే పంచాయతీ భవన ప్రారంభ తేదీని నిర్ణయించామన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గ్రామ పంచాయతీ భవన ప్రారంభానికి రావడం లేదని అధికారుల సూచన మేరకు రెండుసార్లు వాయిదా వేసుకున్నామన్నారు. 22న ప్రారంభం చేసుకోవాలని పంచాయతీ రాజ్ అధికారుల సూచించడంతో ముందుకు వెళ్లగా ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ భూపాల్‌లు ఎందుకు సెలవు తీసుకున్నారని ప్రశ్నించారు.

జెడ్పీటీసీలు రాజీనామా చేయాలి

బీఆర్‌ఎస్ పార్టీ గుర్తుపైన గెలిచి అధికార దాహంతో పార్టీ మారిన కేశంపేట, ఫరూఖ్‌నగర్ జెడ్పీటీసీలు తాండ్ర విశాల, వెంకట్‌రాంరెడ్డిలు పదవులకు రాజీనామా చేసి తమపైన ఆరోపణలు చేయాలని డిమాండ్ చేశారు. తాండ్ర విశాలను కేశంపేట జెడ్పీటీసీ అభ్యర్థిగా అప్పట్లో మండలంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు వద్దని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను కోరినా.. ఆమెకే టికెట్ ఇస్తే కష్టపడి గెలిపించామన్నారు. అధికార దాహం లేకుంటే వెంటనే పదవులకు రాజీనామా చేయాలన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కొందరు ముఠాగా ఏర్పాడి తప్పుడు సమాచారం ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే వారిని గుర్తించి దూరంగా ఉంచాలన్నారు. ప్రజలకు దగ్గరగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కేశంపేట, కొత్తపేట, పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి గ్రామాల సర్పంచులు, కొత్తపేట ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్, కోఆప్షన్ సభ్యుడు జమాల్‌ఖాన్ పాల్గొన్నారు.

అతివ.. నీవెక్కడ?

- మహిళల పదవులపై మగాళ్ల పెత్తనం!
- జల్‌పల్లిలో మహిళా కౌన్సిలర్ల స్థానంలో భర్తల చలామణీ
- అధికారిక కార్యక్రమాల్లోనూ వారిదే హడావుడి



జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం

పహాడీషరీఫ్: చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కు జల్‌పల్లి మున్సిపాలిటీలో అమలు కావడం లేదు. ఇక్కడ మహిళా కౌన్సిలర్లలో చాలా వరకు పేరుకు మాత్రమే ప్రజా ప్రతినిధులుగా ఉన్నారు. అన్నీ చూసుకొని చక్కబెట్టేది మాత్రం వారి కుటుంబాలలోని మగవారే కావడం గమనార్హం. కొన్ని వార్డులలో భర్తలు.. మరికొన్ని వార్డులలో వారసులు.. ఇంకొన్ని వార్డులలో సోదరులు ఇలాయిస్తున్న పరిస్థితి నెలకొంది. ఏదో ముఖ్యమైన అధికారిక కార్యక్రమం (సంతకం తప్పనిసరి ఉన్న సందర్భం) మినహాయిస్తే.. మిగతా అన్ని సమయాలలో మగమహారాజుల హవా కొనసాగుతోంది. ఇంతటితో ఆగని అనధికార కౌన్సిలర్లు తాము చెప్పిన పని చేయని మున్సిపాలిటీ అధికారులపై నోరు సైతం పారేసుకుంటున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి.

బంధుగణందే హవా

ముస్లిం మైనార్టీలు అధికంగా నివాసం ఉండే జల్‌పల్లి మున్సిపాలిటీలో మహిళా కౌన్సిలర్లు ఉన్న వార్డులలో వారి భర్తలే ఇన్‌చార్జి కౌన్సిలర్లమంటూ బహిరంగంగానే చెప్పుకొంటుంన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి పర్యవేక్షణలో కొనసాగిన సమీక్షా సమావేశంలో 17 మంది మహిళా కౌన్సిలర్లకు గాను కేవలం ఇద్దరు (8, 20 వార్డుల కౌన్సిలర్లు) మాత్రమే పాల్గొనగా.. మిగిలిన స్థానాలకు సంబంధించి మహిళలకు బదులుగా అనధికార కౌన్సిలర్లే పాల్గొనడం గమనార్హం.

మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులివే

దిల్రుసా అజీజా ఫర్వీన్(1వ వార్డు), జింకల రాధిక (4వ వార్డు), రహీమా బేగం (5వ వార్డు), ఫర్హానా నాజ్ (8), సయ్యద్ ఉమేరా రహెమాన్(11), కౌసర్ జహాన్ ఖాద్రీ (12), పుష్పమ్మ (13), హమీదా బేగం (14), ఎనగండ్ల ప్రశాంతి (17), కె.బాషమ్మ(20), షేక్ ఫమీదా బేగం (21), జకియా బేగం (23), షఫియా బేగం (24), ముఖరం ఉన్నీసా బేగం(25), అమీనా జైదీ(26), నూరా (27), తహసీన్ బేగం(28)లు మహిళా కౌన్సిలర్లుగా వ్యవహరిస్తున్నారు. కానీ అధికారం చెలాయించేది మాత్రం తమ తరపున ఉన్న పురుషాధిపత్యమే.

మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి

- షాద్‌నగర్, కొత్తూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీల అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యల గురించి ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. అధికారులు ఆదర్శవంతమైన పాలనను అందించాలన్నారు. ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కొత్తూరు, షాద్‌నగర్ మున్సిపాలిటీలకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. ఏ సమస్య వచ్చినా అధికారులు వెంటనే తన దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. సమావేశంలో కమిషనర్లు వెంకన్న, వీరేందర్, మున్సిపల్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

అత్తాపూర్: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై హర్షద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం... హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ గఫార్ (77) ఈ నెల 21వ తేదీన సాయంత్రం 5 గంటలకు ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లాడు. అనంతరం తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

గద్దర్ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ప్రముఖ రచయిత ప్రొఫెసర్ కంచ ఐలయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 31న తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహావిష్కరణ సభ పోస్టర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంచ ఐలయ్య మాట్లాడుతూ గద్దర్ తన పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేశారన్నారు. ఆయన ఒక పాటగాడు మాత్రమే కాదని ఒక ఫిలాసఫర్‌గా, రచయితగా, నటుడిగా, మేధావిగా, కళాకారుడిగా సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో గద్దర్ గళం ఫౌండర్ కొల్లూరి సత్తయ్య, డాక్టర్ పసునీరు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహం ముసుగులో బంగారం దోచేశాడు

వెంగళరావునగర్: స్నేహంగా ఉంటూ నమ్మించి ఓ మహిళ నుంచి బంగారాన్ని దోచేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ ప్రాంతానికి చెందిన మహిళకు ఐదేళ్ల క్రితం ప్రయాణంలో బాబాజీ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి తరచూ వారి ఇంటికి వచ్చి వెళుతుండేవాడు. ఈ నెల 21న సాయంత్రం సదరు మహిళకు ఫోన్ చేసి వెయ్యి రూపాయలు కావాలని, జవహర్‌నగర్‌లోని తన ఇంటికి వచ్చి ఇవ్వాలని కోరాడు. దీంతో ఆమె ఇంటికి వెళ్ల డబ్బులు ఇచ్చేందుకు ప్రయత్నించగా తీసుకోకుండా ఆమె ఒంటిపై ఉన్న బంగారు మంగళసూత్రం, గొలుసు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలు కేకలు వేయడంతో అక్కడే ఉన్న ఇద్దరు వ్యక్తులు అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకున్నాడు. రెండురోజులుగా అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో బాధితురాలు మంగళవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

హఫీజ్‌పేట్: రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీధర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా కోవెలమూడి గ్రామానికి చెందిన రామినేని మహేష్ బాబు (32) నగరంలోని రామచంద్రాపురంలో నివాసముంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మంగళవారం మియాపూర్‌లోని తన స్నేహితుడి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో చందానగర్‌లోని క్రీమ్‌స్టోన్ ఐస్ క్రీమ్ షాప్ సమీపంలో వెనకనుంచి వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. అతడిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసు నమోదు

తలకొండపల్లి: జేసీబీ బ్యాటరీలు, రెండు బకెట్‌ల జేసీబీ ఇనుప పళ్లు దొంగలించిన విషయంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీను చెప్పిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తుమ్మలకుంట తండాకు చెందిన మాన్యనాయక్‌కు జేసీబీ ఉంది. అతను ఈ నెల 18న జేసీబీ తీసుకొని కర్కాస్ తండా సమీపంలో ఉన్న రాయి గుట్టకు వెళ్లాడు. పని ముగిసిన తర్వాత జేసీబీతో పాటు, 2 బ్యాటరీలు, రెండు బకెట్‌ల జేసీబీ పళ్లు, 150 లీటర్ల డీజిల్‌ను ఓ రూమ్‌లో ఉంచి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం మాన్యనాయక్ గుట్టకు వెళ్లి చూసే సరికి బ్యాటరీలు, డీజిల్, పళ్లు కనిపించలేదు. దీనిపై మాన్యనాయక్ ఇచ్చిన పిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గృహిణి అదృశ్యం



నేహా బేగం (ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బి.వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాహీనగర్‌కు చెందిన షేక్ ఖదీర్ సోదరి నేహా బేగం(29)ను ఫలక్‌నామాకు చెందిన షరీఫ్ ఖాన్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి నలుగురు సంతానం. కాగా నెల క్రితం షరీఫ్‌ఖాన్ ఖతర్ దేశానికి వెళ్లడంతో ఆమె పుట్టింటికి వచ్చింది. ఈ నెల 17న పిల్లలతో కలిసి అత్తగారింటికి వెళ్లింది. సోమవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా అత్తగారింటి నుంచి వెళ్లిపోయింది. అత్తింటి వారి ద్వారా సమాచారం తెలుసుకున్న ఖదీర్ ఆమె ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 87126 62366 నంబర్‌లో సమాచారం అందించాలని కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

ఏడున్నర తులాల బంగారం, రూ.30 వేల నగదు అపహరణ



బీరువాలో సామగ్రిని చిందరవందరగా పడేసిన దృశ్యం

షాద్‌నగర్‌రూరల్: పట్టపగలే ఇంట్లో చొరబడి లూటీ చేసిన సంఘటన మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కాలనీలో నివాసం ఉంటున్న రాజుయాదవ్ మధ్యాహ్న సమయంలో పని నిమిత్తం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాడు. తిరిగి రెండు గంటల తర్వాత ఇంటికి వచ్చే సరికి దుండగులు తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న ఏడున్నర తులాల బంగారు ఆభరణాలతో పాటుగా, రూ.30 వేల నగదును దొంగిలించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రవీందర్‌గౌడ్ (ఫైల్)

నందిగామ: ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని చంద్రాయన్‌గూడ సమీపంలో పాత జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై గోపాల కృష్ణ వివరాల ప్రకారం.. చంద్రాయన్‌గూడ గ్రామానికి చెందిన రవీందర్‌గౌడ్(40) తన ద్విచక్ర వాహనంపై మంగళవారం సాయంత్రం షాద్‌నగర్‌కు వెళ్తుందుకు బయలుదేరారు. ఆయన చంద్రాయన్‌గూడ చౌరస్తా వద్ద రోడ్డు మలుపుతుండగా షాద్‌నగర్ నుంచి కొత్తూరు వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రవీందర్‌గౌడ్‌కు తీవ్ర రక్తగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆయన మృతి చెందారు. మృతుడి భార్య అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

గోడ దూకి.. తాళం పగలగొట్టి

- విల్లాలో ముసుగు దొంగల చోరీ
- నాలుగు తులాల బంగారు పుస్తెల తాడు అపహరణ
- కేసు నమోదు చేసిన మహేశ్వరం పోలీసులు

మహేశ్వరం: విల్లా గోడ దూకి.. ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు చోరీకి పాల్పడిన ఘటన సోమవారం అర్ధరాత్రి మహేశ్వరంలో చోటు చేసుకుంది. సీఐ ముని తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మలూరు పరిధిలోని శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ఉన్న బీటీఆర్ మ్యాక్ ప్రాజెక్టు 619 నంబర్ విల్లాలో పుట్ట రాము దంపతులు నివాసం ఉంటున్నారు. సోమవారం విల్లా ప్రధాన రహదారి తలుపులు మూసేసిన అనంతరం.. రాము భార్య తన మెడలోని నాలుగు తులాల పుస్తెల తాడును టేబుల్ పైన పెట్టి నిద్రపోయారు. మంగళవారం అర్ధరాత్రి మ్యాక్ ప్రాజెక్టు గోడపై నున్న తీగలను కత్తిరించిన ముగ్గురు దొంగలు.. ముఖాలకు మాస్కులు ధరించి వంట గది తాళం పగుల గొట్టి విల్లాలోకి చొరబడ్డారు. హాల్‌లోని టేబుల్‌పైన పెట్టిన పుస్తెల తాడును తీసుకొని వెళ్తుండగా శబ్దం రావడంతో.. ఇంట్లో నిద్రిస్తున్న వారు దొంగదొంగ అని అరవడంతో గోడ దూకి పారిపోయారు. రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ రవీందర్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీసీ పుటేజీలను తనిఖీ చేశారు. త్వరలోనే దుండగులను పట్టుకుంటామని తెలిపారు.

వర్సిటీ భూముల జోలికి రావొద్దు



ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: విశ్వవిద్యాలయాలకు చెందిన 100 ఎకరాల భూమిని హైకోర్టు నూతన భవనాలకు కేటాయించవద్దని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ విద్యార్థులు చేస్తున్న ధర్నా 15వ రోజుకు చేరుకుంది. ఇందుకు సంబంధించి జీఓ నంబర్ 55ను రద్దు చేయాలని మంగళవారం కోరారు. వీరికి మద్దతుగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ విద్యార్థులు మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యానవన భూములపై అశ్రద్ధ వహిస్తే తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్ర వ్యవసాయ రంగానికి భవిష్యత్తులో పరిశోధనలు, నూతన వంగడాల ఆవిష్కరణలకు ఇది చెంప పెట్టులాంటిదని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టీ.నాగరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కొట రమేష్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి. శంకర్ ఎం.స్టాలిన్, వేణుప్రకాశ్, యూనివర్శిటి విద్యార్థి నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, శంకర్, వంశీ, అరవింద్, మధుకర్, శివజ్యోతి ,నవీన్, విక్రమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిడుగు జీవన సాఫల్య జాతీయ పురస్కారాల ప్రదానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గిడుగు రామ్మూర్తి వర్ధంతి సందర్భంగా మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందించిన ప్రముఖులను గిడుగు జీవన సాఫత్య జాతీయ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.చంద్రయ్య మాట్లాడుతూ తెలుగు సాహిత్యానికి గిడుగు రామ్మూర్తి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అనంతరం మామిడాల శైలజ రచించిన అంతర్లీనం కవిత, నామని సుజనదేవి రచించిన ఆకాశమంత కథల సంపుటిని ఆవిష్కరించారు. డాక్టర్ ఉషారాణి, కోమటిరెడ్డి మైపాల్‌రెడ్డి, అంబటిలింగ కృష్ణారెడ్డి, మామిడాల శైలజ తదితరులను పురస్కారాలతో సత్కరించారు. సుప్రసిద్ధ కవి డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లవాడియా, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, డాక్టర్ నాలేశ్వరం శంకరం, డాక్టర్ జల్లి విద్యాధర్, గిడుగు ఫౌండేషన్ చైర్మన్ గిడుగు క్రాంతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- ఇంటి నిర్మాణ అనుమతి కోసం రూ.45 వేలు తీసుకుంటూ పట్టుబడిన వైనం
- పంచాయతీ కార్యదర్శి, బిల్ కలెక్టర్ అరెస్టు



ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి, బిల్ కలెక్టర్

శంషాబాద్ రూరల్: ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చేందుకు లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి, బిల్ కలెక్టర్(కారోబార్) ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే..శంషాబాద్ మండలం, నర్కూడ పంచాయతీ పరిధిలోని అమ్మపల్లి రెవెన్యూలో శంషాబాద్‌కు చెందిన మధు బంధువులు ఇంటి నిర్మాణం చేపట్టారు. అనుమతి కోసం ఈ నెల 2న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు 5 వ తేదీ నర్కూడ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నర్సింహను కలిశారు. అతడి సూచన మేరకు బిల్ కలెక్టర్ నాగరాజును సంప్రదించగా రూ.65 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో మరోసారి పంచాయతీ కార్యదర్శిని కలవగా రూ.45 వేలకు ఒప్పుకున్నాడు. ఈ మేరకు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో అతడికి నగదును ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని నగదును స్వాధీనం చేసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నర్సింహ, బిల్ కలెక్టర్ నాగరాజును అదుపులోకి తీసుకున్నామని, నిందితులను బుధవారం స్పెషల్ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఏసీబీ రంగారెడ్డి డీఎస్పీ కె.భద్రయ్య తెలిపారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.